

# మ్యూజికల్ మ్యూజింగ్స్



- కస్తూరి మురళీకృష్ణ

**'ఎంత సక్కగున్నావే ఓ లచ్మీ'** అనే పాట ఈ మధ్య కాలంలో బాగా పాపులర్ అయింది. ఎంతోమంది ఆ పాటను తమ కాలర్ ట్యూన్‌గా కూడా పెట్టుకున్నారు. అంత చక్కని పాట వచ్చే సందర్భం కొంత ఇబ్బందిగా అనిపిస్తుంది. నాయిక స్నానం చేస్తుంటుంది అప్పుడామెని హీరో చూస్తాడు. ఆమె స్వరూపాన్ని చూసి మరో లోకంలో చూస్తూన్నట్టు వివశుడై, పరవశుడై హీరో సర్వం మరచి తన ధోరణిలో తాను పాడుకుంటూ పోతాడు. 'నాయిక స్నానం చేస్తుంటే చూసిన హీరో' ఇలా అయిపోయి మరేదో లోకంలో ఉన్నట్టు పాడుతూ పోవటం ఆధునిక తరం మెచ్చినా, ఆలోచిస్తే అపహాస్యంగా, వికృతంగా అనిపిస్తుంది.

స్త్రీ అపురూపం .ఆమె శరీరం ఎంత అపురూపమో ఆమె మనస్సు అంతే అపురూపం. ప్రేమ అన్నదానికి రూపం ప్రాతిపదిక అయినా ఆ'రూపం' ప్రేమ ప్రయాణంలో మొదటి అడుగు మాత్రమే. కానీ మన సినిమాలలో రూపానికీ, శరీరానికి ఉన్న ప్రాధాన్యం మనసుకు కనబడదు. పాటలలో కూడా, ఇది కనిపిస్తుంది. 'ఎంత సక్కగున్నావే' అంటూ ఆమె చక్కదనాన్ని వర్ణిస్తాడు నాయకుడు. ఇంతకీ ఆమె అలంకరణలతో ఉన్నప్పుడు చూడలేదు నాయకుడు. స్నానం చేస్తున్నప్పుడు చూశాడు దాంతో ఎంత ప్రయత్నించినా భావన ఒక దిగజారుడు స్థాయిలోనే ఉంటుంది.

**యేరు సెనగ కోసం మట్టిని తవ్వితే ఏకంగా తగిలిన లంకెబిందెలాగ**
**సింతసెట్టు ఎక్కి సిగురు కొయ్యబోతే చేతికి అందిన సందమామలాగ**

అంటూ ఆమెని చూస్తే తనకు కలిగిన భావ తీవ్రతను, సౌందర్య భావనను వ్యక్తీకరిస్తాడు నాయకుడు. గమనిస్తే ఈ వర్ణన అంత గొప్పగా అనిపించదు . ఏదో వెతుకుతుంటే ఏదో దొరికిందన్న భావన కలిగిస్తుంది. పైగా సింతసెట్టు ఎక్కితే చందమామ అందటం ఉహాపరంగా బావున్నా ఔచిత్యంగా అనిపించదు. చింతచెట్టుకు దయ్యాలుంటాయన్న భయం ఉంటుంది. చందమామ అందాలంటే రాత్రిపూట చెట్టుఎక్కాలి. రాత్రిపూట చింతచెట్టు ఎక్కటం కుదరదు. అయినా రాత్రిపూట కాదు పగటిపూట చెట్టు ఎక్కాడనుకుంటే చందమామ ఉండదు. కాబట్టి అన్వయం కుదరదు. అలాంటప్పుడు ఈ కవితను మనసుతో చూసి అన్వయించుకుని అనుభవించాల్సి ఉంటుంది. కానీ ఎలా అనుభవించినా ఏదో వెతుకుతూంటే ఇంకేదో దొరికిన భావన మాత్రంపోదు.

ఈ పాట వినగానే నాయికను చూసిన ఆనందంలో తన్మయుడై నాయకుడు సంతోషంతో 'ఎక్ లడ్‌కీ కో దేఖాతో ఐసా లగా' అని పాడుతూ దిండును చించేయటం గుర్తుకు వస్తుంది. ఆ పాటలోని వర్ణనలు అన్నీ లయబద్ధంగా ఉన్నా అత్యంత సామాన్యమైనవి. అలవాటయినవి. విరిసిన గులాబీ, కవి కల, మెరిసే కిరణం, వనంలో హరిణం, వెన్నెల రాత్రి, చక్కటి పాటలాంటి మాట, ఇలాంటివి గుర్తుకు వస్తాయి నాయకుడికి నాయికను చూడగానే. అయితే ఈ పాటలో వర్ణనలు సామాన్యంగా ఉన్నా పాట బాణీ, పాడిన విధానం పాటను మరుపురాని పాటగా మలుస్తాయి. చిత్రీకరణ దగ్గరకు వచ్చేసరికి చింపగా ఎగసిన దిండులోని దూది ముక్కలు మనసులో మిగులుతాయి. పాట ప్రభావం హాస్యాస్పదం అవుతుంది. ఇక్కడ గమనించాల్సిందేమిటంటే పై రెండు సందర్భాలలోను నాయకుడు నాయికను క్షణంసేపే చూస్తాడు. తీవ్రమైన భావావేశానికి గురి అవుతాడు. ప్రపంచాన్ని మరచిపోతాడు. ఒక యువకుడు తనకు ఇష్టమైన యువతిని చూసి, ఆమె అందాన్ని చూసి మైమరచిపోయి తీవ్రమైన భావావేశానికి గురై ఒకరకమయిన ఉన్మాద స్థితికి వెళ్లటం అన్నది సర్వసాధారణం. అది ఆ వ్యక్తి

మనస్సులో ప్రతిష్ఠితమై ఉన్న ప్రేమభావన, రొమాంటిక్ ఊహల స్వరూపంపై ఆధారపడి ఉంటుంది. నిజానికి ఒక యువకుడు ఒక యువతిని చూసి, ఆమె అందం చూసి తన్మయుడై అత్యంత భావావేశానికి గురై, ఆ భావావేశంలో భౌతిక పరిధులు దాటి ఆధ్యాత్మకపుటానందపుటంచులను స్పృశించటం కూడా జరుగుతుంది. ఇందుకు ఆ యువకుడికి ఆ యువతి పరిచయం ఉండాల్సిన పనిలేదు. అతడి భావావేశ తీవ్రత, సమాధిస్థితిని, బ్రహ్మానందానుభూతిని తలపింపచేస్తే తీవ్రమైన ఆనందమయ స్థితిని అతడు అనుభవించటం వెనుక అతడి సంస్కారం, శృంగారపుటూహల స్వరూపం వంటి అనేక అంశాలు ఆధారపడి ఉంటాయి. సందర్భం ఎలాంటిదయినా నాయికను నాయకుడు చూసిన ప్రథమ క్షణంలో కలిగిన తీవ్రమైన భావావేశాన్ని ఏ అత్యుత్తమ స్థాయిలో ప్రదర్శిస్తాడన్నది ఆ సందర్భంలో గీతాన్ని రచించే రచయిత భావనాబలం, సంస్కారం వంటి అంశాలపై ఆధారపడి ఉంటుంది.

'బారాదరి' అనే సినిమాలో నాయకుడు నాయికను ఒకసారి చూస్తాడు. ఆమె అందం అతడిలో తీవ్రమైన కలతను కలిగిస్తుంది. అతడిలోని సృజనాత్మక భావనకు రెక్కలనిస్తుంది. రొమాంటిక్ భావనకు జీవం పోస్తుంది. అతడిలోని కళాకారుడు నిద్రలేస్తాడు.

'కళ' అన్నది వ్యక్తిలో నిక్షిప్తమై ఉన్న భగవదంశకు ప్రతీక. అత్యుత్తమ కళ ప్రకృతికి అతి సమీపంగా ఉంటూ ప్రకృతిని తన కళలో ప్రతిష్ఠించినదే. సజీవంగా నిలిపేది. అంటే భగవంతుడి సృష్టిలోని సౌందర్య భావన ఆత్మను పట్టుకుని దాన్ని తన కళద్వారా ప్రకటితం చేయటం, తద్వారా సామాన్యులలో నిద్రాణమై ఉన్న సౌందర్య భావనను జాగృతం చేస్తుంది. సౌందర్యానుభవం కలిగిస్తుంది. వారికి దైవత్వ భావనను క్షణకాలమైనా అనుభవానికి తెస్తుంది. ఇది కళ పరమార్థం. ఏ కళాకారుడయితే తన కళద్వారా ఇలాంటి భావనలను జాగృతం చేస్తాడో అతడు అసలైన కళాకారుడు. సినిమా పాటల్లో గీత రచయిత, సంగీత దర్శకుడు, గాయకుడు, వాయిద్యకారులు అందరు కలసి ఇలాంటి కళను తమ పాటల్లో ప్రదర్శిస్తారు.

'బారాదరి'లో నాయికను చూసిన నాయకుడి హృదయంలో నాయక రూపం ప్రతిష్ఠితమౌతుంది. ఇప్పుడామె ప్రకృతి సౌందర్యానికి, భగవంతుడి సృజనాత్మక కౌశలానికి ప్రతీక. ఆమెను తన కళద్వార సజీవంగా నిలపాలన్నది నాయకుడి ప్రయత్నం.

అతడు చిత్రకారుడు. ఆమె చిత్రాన్ని గీయాలని ప్రయత్నిస్తాడు. తన చిత్రంలో ఆమెను సజీవంగా ప్రతిష్ఠించాలని తపనపడతాడు. కానీ అది సాధ్యం కాదు.

విన్సెంట్ వాన్‌గో అనే చిత్రకారుడు ఒకో చిత్రపటాన్ని కొన్ని వందలమార్లు గీసినా సంతృప్తి పడేవాడుకాదు. మన నాయకుడు అలాంటి పరిస్థితిలోనే ఉన్నాడు. అయితే విన్సెంట్ వాన్‌గో రోజూ ఆ ప్రకృతి దృశ్యం దగ్గరకు వెళ్లి కూర్చునేవాడు. కానీ మన నాయకుడికి అలాంటి అవకాశం లేదు. ఆమెను క్షణకాలం మాత్రం చూశాడు. ఆ క్షణకాలం మాత్రం మనసులో మెరుపు మెరిపించిన ఆ సుందర స్వరూపాన్ని సజీవంగా చిత్రంలో బంధించాలనుకుంటాడు. కానీ అది సాధ్యం కాదు. అతడి ఆవేదనను, ఆక్రోశాన్నీ, నిరాశను పాటలో ప్రదర్శిస్తాడు.

**తస్వీర్ బనా తాహూ, తస్వీర్ నహీ బన్ తీ**

**ఎక్ ఖ్వాబ్ స దేఖా థా, తాబీర్ నహీ బన్ తీ**

చిత్రపటాన్ని గీస్తున్నాను. కానీ చిత్రం రావటంలేదు. ఒక స్వప్నాన్ని దర్శించాను. కానీ ఆ స్వప్నం స్వరూపం బోధపడటంలేదు.

పల్లవిలోనే అసలు విషయం ప్రదర్శించేశాడు గేయరచయిత ప్రతీకాత్మకంగా 'కుమార్ బారా బంక్వీ' అత్యంత సున్నితంగా సృజించాడీగీతాన్ని

**బేదర్ద్ మహబ్బత్ కా ఇతనా స హై అఫ్సానా**

**నజ్రోంసె మిలీ నజ్రే మై హోగయ దీవానా**

**అబ్ దిల్ కె బహల్‌నేకీ తద్‌బీర్ నహీ బన్ తీ**

బాధాకరమైన ప్రేమ గాథను ఒక్క ముక్కలో చెప్పవచ్చు.. కళ్లతో కళ్లు కలిశాయి. నేను పిచ్చివాడినయిపోయాను. ఇపుడు హృదయానికి సంతృప్తినిచ్చిన ఆనందం కలిగించే సృజన కుదరటంలేదు. ఇదీ అతడి బాధ.

ఆమె అతడిలో సృజనాత్మక ఆవేశాన్ని రగిలించింది. ఆ ఆవేశాన్ని తన కళలో ప్రదర్శించలేకపోతున్నాడు. ఒక వ్యక్తి ఆత్మ అతని కళ్ళల్లో కనిపిస్తుంది. ఇక్కడ కళ్ళు కళ్ళు కలవటాన్ని భౌతికపరమైన అర్థంలో తీసుకుంటే నాయకుడి భావ తీవ్రత అర్థం కాదు. కళ్ళద్వారా ఆత్మ ఆత్మను దర్శించింది అన్నట్టు అర్థం చేసుకుంటే, ప్రకృతిలో భగవంతుడి ఆత్మను దర్శించి దాన్ని తన కళలో సజీవంగా నిలపాలనుకునే కళాకారుడి తపన అర్థమవుతుంది.

ఎంత సుందరంగా ప్రదర్శించాడు కవి సృజనాత్మక భావావేశాన్ని అత్యంత అలతి పదాలలో.

**దం భర్ కె లియే మేరే దునియామే చలే ఆవో**

**తర్సీ హువి ఆఖోంకో ఫిర్ శక్ల్ దిఖాజావో**

**ముఝ్ సే తొ మెరీ బిగ్డీ తక్దీర్ నహీ బన్ తీ**

తన ఆవేశాన్ని సృజనాత్మక రూపంలో వ్యక్తపరచటంలో విఫలమౌతున్నాడు. ఎంతప్రయత్నించినా మనస్సులోని ఆవేశం కళలో వ్యక్తం కావటంలేదు. ప్రకృతిని చిత్రించే కళాకారులు మళ్లీ ప్రకృతిని దర్శిస్తారు. ముందుగా పెన్సిల్‌తో స్కెచ్ వేసుకుంటారు. తరువాత రంగులు నింపుతారు. కానీ మన చిత్రకారుడికి ఆ వీలు లేదు. అందుకని మళ్లీ ఆమె వదనాన్ని దర్శింపచేయమంటున్నాడు. అప్పుడుకానీ అతడు తననుకున్న కళను సృజించలేడు. తనతో తన అదృష్టాన్నిబాగు పరచుకోవటం చేతకావటం లేదు కాబట్టి ఆమెని ఒక్కసారి కనిపించమంటున్నాడు.

ఉత్తమమైన కళ ప్రభావం ఉత్తమంగా ఉంటుంది. ఈ పాటను సంగీత దర్శకుడు నాషాద్ (చాలామంది నౌషాద్ అని పొరపడతారు) పహాడి రాగంలో రూపొందించాడు. పహాడీ రాగం విషా దానికి, దైన్యానికి అత్యద్భుతంగా ప్రాణం పోస్తుంది. ఇక్కడ నాయకుడు దుర్భరమైన విషాదంలో ఉన్నాడు. దాంతో అతడి భావనలను వ్యక్తపరిచే గీతం విషాద భావాన్ని ప్రతిఫలించే రాగంలో రూపొందటంతో పాట ప్రభావం ద్విగుణీకృతమౌతుంది. రాగం, రాగానికి తగ్గ భావం తోడయ్యాయి. ఇక స్వరం మిగిలింది. అది గజల్ గానంలో రారాజుగా గుర్తింపు పొందిన తలత్ మహమ్మూద్‌ది కావటంతో బంగారానికి తావి అబ్బినట్టయింది. గుండెలోలోతుల్లోని విషాదభావనలను తట్టిలేపి విషాదం అంచులలో ఒదిగి ఉన్న ఆనంద భావన స్వరూపాన్ని అనుభవానికి తెస్తూ వ్యక్తిలోని దైవత్వ భావనకు రెక్కలనివ్వటమనే ప్రక్రియను సంపూర్ణం చేస్తుందీపాట. ఒక అందమైన అమ్మాయి ఒక యువకుడి మనసులో దర్శన మాత్రంతో కలిగించే అలజడిని అందంగా ప్రదర్శించిన పాట ఇది.

దీవానా (1952) అనే సినిమాలో కూడా నాయికను ఒకసారి చూస్తాడు నాయకుడు. ఆమెతో ప్రేమలో పడతాడు. ఆమె చిత్రపటం గీస్తాడు. పాట పాడతాడు.

**తస్వీర్ బనాతాహు తెరీ ఖూన్-ఎ-జిగర్ సే**

**దేఖాహై మైనె తుఝే మొహబ్బత్‌కి నజర్ సే**

ఆమెను ప్రేమ నిండిన దృక్కులతో చూశాడట. ప్రేమ నిండిన ద్రుక్కులు అంటేనే భౌతిక పరిధి దాటిన దృష్టి అని అర్థం. ఇప్పుడు ఆమె చిత్రపటాన్ని తన హృదయంలోని రక్తంతో(మనసుతో) సృజిస్తున్నాడు. అద్భుతం! ఇక్కడ నాయకుడికి 'బారాదరీ' లో నాయకుడిలా చిత్రపటం తయారు చేయటంలో సమస్య రాలేదు. ఆమె చిత్రపటం తయారయింది. ఎలా తయారు చేశాడో కూడా చెప్తున్నాడు.

**జిత్నేభి మిలే రంగ్ వోసబ్ భర్దియ తుఝ్ మే**

**ఎక్ రంగ్-ఎ- వఫా ఔర్ హై లావూమై కిధర్ సే**

ఎన్ని రంగులున్నాయో అన్ని రంగులతో ఆమె చిత్రపటాన్ని నింపేశాడు. కానీ విశ్వాసం అనే రంగును ఎక్కడినుంచి తేవాలో అర్థం కావటంలేదంటున్నాడు. చమత్కారం.

చిత్రపటం ఎంతగా అమ్మాయిని పోలి ఉన్నా, ఎంతగా సజీవంగా ఉన్న భావనను కలిగించినా అది 'సజీవం' కాదు. ఈ విషయాన్నే 'తాజ్‌మహల్' సినిమాలో సాహిర్ లూధియాన్వీ అద్భుతంగా తన కవితాగీతంలో ప్రదర్శించాడు.

జో బాత్ తుఝ్ మే హై తెరీ తస్వీర్ మే నహీ

'నీలో ఉన్న అంశం నీ చిత్రపటంలో లేదు'తీర్మానం చేసేశాడు పల్లవిలోనే. ఎందుకని లేదో చరణంలో చెప్తున్నాడు.

**రంగోమె తెరా అక్స్ ఢలా తూ న ఢల్ సకీ**

**సాసోంకి ఆచ్, జిస్మ్ కే ఖుష్బూ న ఢల్ సకీ**

**తుఝ్ మే జొ లోచ్ హై తెరీ తహరీర్ మేనహీ**

ఆమె బొమ్మలో రంగులు వెలిసిపోయాయి. ఆమె వెలిసిపోవటం అంటూ వుండదు. ఆమె ఊపిరిలోని వెచ్చదనం, శరీరంలోని పరిమళం తగ్గలేదు. అవేవీ బొమ్మలో లేవు. ఆమెలోని చైతన్యం ఆమె recreation అయిన ఆమె బొమ్మలో లేదు.

**బేజాన్హుస్న్ మే కహా, రఫ్తార్ కీ అదా**

**ఇన్ కార్ కీ అదా హై, న ఇక్రార్ కీ అదా**

**కోయీ భి లచక్ భి జుల్ఫ్-ఎ-గిరహగీర్ మే నహీ**

నిర్జీవమైన అందంలో చలనం ఉండదు. ఆ నిర్జీవమైన చిత్రపటం తన ప్రేమను స్వీకరించదు. నిరాకరించదు. ఆమె కురుల వంకీలు, చిత్రపటంలో ఉండవు. కాబట్టి చిత్రపటం ఆమెను పోలి ఉన్నా ఆమె కాదు.

కానీ 'దీవానా' సినిమాలో నాయకుడికి తన చిత్రపటం ఎంతగానో నచ్చింది ఆమె చిత్రపటాన్ని ఆమెగానే భావిస్తూ ఆమెతో మాట్లాడుతున్నట్లే భావిస్తూ, తన మనసులోని మాటలు చిత్రపటానికి చెప్పుకుంటున్నాడు.

**సావన్ తెరి జుల్ఫోంసె ఘటా మాంగ్ కె లాయా**

**బిజి లీ నె చురాయీ హై తడప్ తేరి నరజ్ సే**

వర్షఋతువు, ఆమె కురులను అడిగి మేఘాలను తీసుకు వచ్చిందట. మెరుపులు ఆమె కళ్లనుంచి మెరుపులను దొంగిలించాయట. చివరి చరణం చమత్కారం.

**మై దిల్ మెబులాకర్ తుఝే రుఖ్సత్ న కరూంగా**

**ముష్కిల్ హై తెరా లౌట్ కే జానా మెరె ఘర్ సే**

ఆమెను హృదయంలోకి ఆహ్వానిస్తాడట కానీ వీడ్కోలు చెప్పడట. ఎందుకంటే అతడి ఇంటిని వదిలి వెళ్లటం కుదరని పనికాబట్టి. ఇదీ ఒక అమ్మాయిని దర్శన మాత్రంతోనే యువకుడి హృదయంలో కలిగిన భావసంచలన స్వరూపం. ఎక్కడా ఎలాంటి చులకన భావంలేదు. తేలిక భావన లేదు. వెకిలితనం లేదు. అత్యున్నతమూ, అత్యంత సంస్కారవంతం, అయిన భావనలు.

ఒక అమ్మాయి శరీరాన్ని చూడగానే మైమరచిపోయి పాడటం కాదు. ఒక అమ్మాయి రూపాన్ని దర్శించి, ఆ రూపంలో ఒదిగిన ఆత్మస్వరూపాన్ని అర్థం చేసుకుని, తన్మయమౌతూ, చెలరేగిన భావాల తుఫానులను తన గీతంలో ప్రదర్శించటంలో భౌతికతను దాటి

ఆధ్యాత్మిక భావాన్ని మెరుపులా ప్రదర్శించటం అసలు ప్రేమ. ప్రేమ భావన, రూపంతో ఆరంభమయి, ఆత్మానుభూతితో తీవ్రమై, పరమాత్మ సాక్షాత్కారంతో సంపూర్ణమవుతుంది.

మరో సినిమాలో నాయకుడు నాయిక వదనాన్ని కూడా చూడడు. అనుకోని పరిస్థితులలో నాయిక, నాయకులు ఒకరికొకరు తగులుతారు. నాయిక చేతిలోని పుస్తకాలు పడిపోతాయి. అప్పుడు ముఖంపై ఉన్న బురఖాలోని ఆమె కళ్లను మాత్రం చూస్తాడు నాయకుడు. పుస్తకాలను ఏరి ఇస్తున్నప్పుడు ఆమె చేయి తాకుతుంది. అంతే ... ఆమె ఎవరో అతడికి తెలియదు. ఆమె కళ్లు, కరస్పర్శ అతడిలో కలిగించిన భావావేశ తీవ్రత అత్యద్భుతమైన అత్యంత సంస్కారవంతమైన భావనలతో కూడిన గంగా ప్రవాహంలాంటి అతి స్వచ్ఛమైన ప్రేమగీతంలా వ్యక్తమౌతుంది.

**మేరె మహబూబ్ తుఝే మేరి మొహబ్బత్ కి కసం**
**ఫిర్ ముఝే నర్గిసి ఆంఖోంక సహారా దేదే**
**మెర ఖోయా హువ రంగీన్నజారా దేదే**

అతడికి మళ్లీ ఆమె అందమైన కళ్ల ఆసరా కావాలట. అతడు కోల్పోయిన అత్యద్భుతమైన దృశ్యం కావాలట. ఇక్కడ దృశ్యం, సహారావంటి పదాలు మాములు అర్ధంలో తీసుకోకూడదు.

**ఏయ్ మేరె ఖ్వాబ్ కి తాబీర్ మెరీ జాన్-ఎ-గజల్**
**జిందగీ మేరితుఝే యాద్ కియే జాతీ హై**
**రాత్ దిన్ ముఖ్ కో సతాతా హై తసవ్వుర్ తేరా**
**దిల్‌కిధఢ్ కన్ తుఝే ఆవాజ్ దియే జాతీ హై**
**ఆ ముఝే అప్ని సదావోం కె సహారా దేదే.**

ఈ చరణంలో భావం సుందరమైనదే. అతడి కలల స్వరూపం ఆమె. అతని హృదయ గానానికి ప్రాణం ఆమె. అతడి జీవితం ఆమెని జ్ఞాపకం చేసుకుంటోంది. రాత్రింబవళ్లు ఆమె ఆలోచనలు సతాయిస్తున్నాయి. అతడి హృదయం ఆమెని పిలుస్తోంది.

**యాద్ హై ముఝ్ కో మెరీఉమ్ర్ కి పహల్లీ హో ఘడీ**
**తేరీ ఆఖోంసె కొయీ జాం పియాథా మైనే**
**మేరి రగ్ రగ్ మె కొయీ బర్క్ సి లహరాయాథీ**
**జబ్‌తెరీ మర్మరి హాథోంకొ ఛువా థా మైనే**
**ఆ ముర్సే ఫిర్ ఉనీ హాథోం క సహారా దేదే**

అతడి జీవితంలో చైతన్యం కలిగిన ప్రధమ ఘడియ జ్ఞాపకం ఉందని. ఇక్కడ అతడి జీవితంలో చైతన్యం కలిగిన ప్రధమ ఘడియ ఏమిటంటే, ఆమె కళ్లల్లోంచి అమృతం అతడు తాగిన ఘడియ. అంత వరకూ అతడు ఏదో బ్రతుకుతున్నాడు. ఆమె కళ్లతో కళ్లు కలిసిన క్షణం నుంచే అతడి జీవితం ఆరంభమయింది. అందుకే అది అతడి జీవితంలోని ప్రధమక్షణం. ఇక్కడ కళ్ళు కలవటం అంటే ఆత్మ దర్శనానుభవం.. ఆమె మృదువైన కరస్పర్శతో అతని శరీరంలో విద్యుత్తటిల్లత అలల్లా ఎగసింది. ఇప్పుడు అతడికి మళ్లీ ఆ చేతుల స్పర్శ కావాలంటున్నాడు.

ఎంత అద్భుతంగా, సున్నితంగా, సంస్కారవంతంగా ఆమెతో కళ్లు కలవటాన్ని, కర స్పర్శను ప్రదర్శించాడు కవి షకీల్ బదాయుని.

**మైనె ఎక్ బార్ తెరీ ఎక్ ఝలక్ దేఖీహై**
**మేర హస్రత్ హై కి మై ఫిర్ తెర దీదార్ కరూ**

తేరె సాయే కా సమఝ్ కర్ మై హసీన్ తాజ్‌మహల్
చాంద్‌నీ రాత్ మె నజ్రోంసె తుఝే ప్యార్ కరూ
అప్‌ని మహకే హువి జుల్ఫోంకె సహారా దేదే

ఈ చరణంలోని భావం పాటకు తలమానికం అనదగినటువంటిది. ఒక్కసారి నేను నిన్ను చూశాను. అదీ క్షణంసేపే. 'ఏక్ ఝలక్' – ఆమెను మళ్లీ చూడాలన్న తీవ్రమైన కోరిక అతడిని దహించి వేస్తోంది. ఆమె నీడనే తాజ్‌మహల్‌లా భావించి, వెన్నెల రాత్రులలో కన్నులతో ఆమెని ప్రేమిస్తాడట.

ఇక్కడ ఆగిపోతాం!

ఆమె నీడనే తాజ్‌మహల్‌లా భావించటం, వెన్నెల రాత్రులలో కన్నులతో ఆమె నీడను ప్రేమించటం.. ఊహకందనంతటువంటి అతి సున్నితమైన రొమాంటిక్ భావన!

తాజ్‌మహల్‌ను ప్రేమ మందిరంగా భావిస్తారు. అత్యద్భుతమైన అందానికి, అలౌకికమైన ఆనందానికి ప్రతీకగా భావిస్తారు. ఆమె నీడను అత్యత్తుమ అందానికి ప్రతీకగా భావిస్తాడట. ఇక్కడ భౌతిక రూపం ప్రసక్తిలేదు. ఆమె 'నీడ' చాలు. ఆమె నీడనే కొలుస్తాడతడు. ఇక ఆమెని ఇంకెంత గొప్పగా భావిస్తాడో!

ప్రేమలో భౌతికత మొదటి మెట్టు మాత్రమే. అదే ప్రేమ కాదు. అదే ప్రేమకు పరాకాష్ట కాదు. ఆమె నీడనే అత్యుత్తమ అందానికి ప్రతీకగా భావించి, వెన్నెల రాత్రిలో కన్నులతో ప్రేమిస్తాడట. వెన్నెల రాత్రుళ్లలో తాజ్‌మహల్ అందాన్ని చూడటానికి రెండు కళ్లు చాలవు. అది చూసినవారు కూడా ఆ అనుభూతిని సరిగా అర్థం చేసుకోలేరు. అలౌకికమైన అందం అది. అలౌకికమైన ఆనందానుభూతి అది. ఆమె నీడనే తాజ్‌మహల్ అయినప్పుడు, వెన్నెల రాత్రిలో ఆ అందాన్ని చూడటమే పరమాద్భుతం.ఇదీ ప్రేమ స్వరూపం.మనిషి శరీరంలో ఆత్మ వుంటుంది. దాని నీడను , కళ్ళతో ప్రేమించటం అంటే, కళ్ళలో ప్రతిఫలించే ఆత్మతో నీడలో ఆమెని దర్శించి ప్రేమించటం...ప్రేమించటం అంటే భౌతికార్థాన్ని తీసుకోకూడదు.

ఎంతో సున్నితమైన ఊహ ఇది. మామూలుగా ఊహకు కూడా అందనంత శృంగార భావన. మాములు శృంగారం కాదు. కన్నులతో ప్రేమించటం. ఎక్కడా భౌతిక శృంగార భావన లేదు. నిజానికి అత్యంత సౌందర్యాన్ని ఎంత చూసినా అలవికాదు. తనివి తీరదు. చూస్తున్నంతసేపు పరమానందంగా ఉంటుంది. ప్రపంచం అదృశ్యమైపోతుంది. ఆ సౌందర్యాన్ని కళ్లనిండా, గుండెల నిండా నింపుకున్న అదృశ్యమైనప్పటినుంచీ మళ్లీ చూడాలన్న తపన కలుగుతుంది. అనంత సౌందర్యాన్ని పరిమిత శక్తికల కళ్లతో, ఇంకా పరిమిత శక్తికల శరీరంతో అనుభవించటం కుదరదు. ఎంత అనుభవించినా అసంతృప్తి కలుగుతుంది. అలాంటి ప్రేమ ఇది. వెన్నెల రాత్రుళ్లలో ఎంత చూసినా తనివి తీరని ఆమె నీడను కళ్లతో ప్రేమించటం అంటే ఇది.

ఢూంఢ్ తా హు తుఝె హర్ రాహమె హర్ మహఫిల్ మే
థక్ గయేహై మేరి మజ్బూర్ తమన్నాకె కదం
ఆజ్ కా దిన్ మెరి ఉమ్మీద్ క హై ఆఖ్రీ దిన్
కల్ న జానే, మై కహా, ఔర్ కహా తుం హొ సనం
దో ఘడీ అప్ని నిగాహోంక సహారాదేదే

అదీ కథ! ఆమెను ఒక్కసారి కొన్ని సెకన్ల కోసం చూశాడు. ఆ క్షణం నుంచీ అతడి జీవితం ఆరంభమయింది. ఆమెను మరోసారి చూడటం కోసం వెతుకుతున్నాడు.

ఆమె కోసం అణువణువూ గాలిస్తున్నాడు. అలా వెతుకుతూ అలసి పోయాడు. ఆ రోజు ఆఖరి రోజు. ఎందుకంటే ఆ రోజుతో కాలేజీ అయిపోతుంది. తెల్లారితే ఎవరెక్కడో తెలియదు. కాబట్టి కొన్ని ఘడియల కోసమైనా ఆమెను కళ్లతో 'సహారా' ఇమ్మంటున్నాడు.కళ్ళంటే కళ్ళ వ్యవహారం కాదిది..ఆత్మ సంబంధి..

**సామ్ నే ఆకే జరపర్ద ఉఠాదే రుఖ్ సే**
**ఎక్ యహీ మేర ఇలాజ్-ఏ-గం-ఏ-తన్ హాయీ హై**
**తేరి ఫుర్కత్ నే పరేషాన్ కియా హై ముఝ్ కో**
**అబ్ తో మిల్జా కే మెరీ జాన్ పే బన్ ఆయీ హై**
**దిల్ కొ ఖాలీ హులి యాదోంక సహారా దేదే..**

ఆమెని ఎదురుగా వచ్చి ముఖం మీదనుంచి పరదా తొలగించమంటున్నాడు. అంటే ఆమెని కనిపించమంటున్నాడు. ఇప్పతిదాకా ఆమేది అస్పాష్ట రూపం. ఇప్పుడు ప్రకటితం కమ్మంటున్నాడు. ఒంటరితనంలోని వేదన అనే రోగానికి ఇదే మందట. ఆమె వియోగం అతడిని బాధిస్తోంది. ప్రాణాలు పోయేట్టుంది. కాబట్టి ఒక్కసారి కలవమంటున్నాడు.

ఇదీ ఒక్క క్షణం యువతిని చూసిన యువకుడి హృదయ విలాపం.

ఇలాంటి అనేక అతి సున్నితమైన అద్భుతమైన సందర్భాలను మన కళాకారులు సృజించారు. ఆయా సందర్భ పరిధిని దాటి భౌతికతలోని ఆధ్యాత్మికతను స్ఫురింపచేస్తూ అత్యద్భుతమైన గేయాలను సినీగేయ రచయితలు సృజించారు. అత్యద్భుతమైన బాణీలతో సంగీత దర్శకులు ఆయా గేయాలకొక రూపం కల్పిస్తే, గాయకులు ఆ రూపానికి ప్రాణం పోసి సజీవంగా సమాజానికి అందించారు. సమాజంలో సామాన్యుని ఆలోచనా స్థాయిని, సంస్కారాన్ని పెంచారు. ఎంతగా అంటే, ఒక సినిమాలో నాయకుడు కేవలం నాయిక పాదాలను చూసి ప్రేమిస్తే, అతడిని చూడకుండానే, కేవలం తన పాదాల సౌందర్యాన్ని మెచ్చుకున్న అతని సున్నితత్వాన్ని నాయిక ప్రేమిస్తే దాన్ని ఆమోదించటమే కాదు, సూపర్ హిట్‌గా నిలిపారు కూడా. అసలు కేవలం పాదాలను చూసి ప్రేమించటం అనే భావననే ఎంతో సున్నితంగా, అద్భుతంగా ఉంటుంది. కళాకారుల సున్నితత్వాన్ని ప్రదర్శిస్తుంది.

(ఇంకావుంది)

Post your comments